క్లుప్తంగా

సేవలకు సత్కారం



సుమతిని సత్కరిస్తున్న వైద్యసిబ్బంది

గంగాధరనెల్లూరు: మండలంలోని నెల్లెపల్లి గ్రామసచివాలయ ఉద్యోగిని తోట సుమతికి గాన కళాసేవా రంగంలో అత్యుత్తమ సేవ లందించినందుకు ప్రతిఫలంగా గతవారం బంగారు నంది అవార్డును ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ ద్వారా ప్రముఖ సినిమా దర్శకుడు, నటుడు క్రిష్ణారెడ్డి బహూకరించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన గాన పోటీలలో ప్రతిభ కనబరిచినందుకు సుమతికి బంగారు నంది మెమెంటోతో పాటు ప్రశంసా పత్రాన్ని సైతం గత వారం అందించారు. ఈ సందర్భంగా సుమతిని జీడీ నెల్లూరు మండల వైద్య సిబ్బంది డా.దుర్గాదేవి, డా.ప్రవీణ్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి సన్మానించారు. సీహెచ్‌ఓ శ్రీనివాసులు, వైద్యసిబ్బంది సుమతిని శాలువాతో సత్కరించి ప్రశంసించారు.

ఆకట్టుకున్న బండి కుంబాలు



పూజలు చేస్తున్న నిర్వాహకులు, భీముడి వేషధారి

వెదురుకుప్పం: మండలంలోని చెంచుగుడి ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బండి కుంబాల కార్యక్రమం ఆకట్టుకుంది. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణిచే హరికథా కాలక్షేపం జరిగింది. సాయంత్రం బలికూడుతో బకాసురుని వేషధారి ప్రదర్శనగా వెళ్లి ప్రసాదాలను అమ్మవారికి సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధికంగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సోమవారం అమ్మవారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ యజ్ఞానికి ఉభయదారులు నారాయణరెడ్డి, శారాదమ్మ కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

రామోజీరావుకు పలువురు నివాళి



రామోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామంలో అక్షర యోధుడు ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకు పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదివారం తూగుండ్రం గ్రామం బస్టాండ్ కూడలిలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జీవరత్నం, నీరజాక్షులురెడ్డి, సంపత్, శ్రీనివాసులుశెట్టి, రాఘవేంద్ర, సంపత్, దినేష్, కమల్, విమల్ నివాళులర్పించారు.

మోస్తరు వర్షం

వెదురుకుప్పం: మండలంలో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. పలు గ్రామాల్లో పెనుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వాన కురిసింది. పెనుగాలులకు మామిడి కాయలు నేల రాలాయి. వాతవరణం చల్లబడింది. ఈ వర్షంతోఉక్కపోతకు గురైన జనం కాస్త ఉపశమనం పొందారు.

చెల్లాటమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పాలసముద్రం: మండలంలోని రెడ్డివారి కుప్పం గ్రామంలో వెలసిన చెల్లాటమ్మకు ఆదివారం వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని ఆలయ అర్చకులు సుప్రభాతసేవతో మేల్కొల్పి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చందనంతో అభిషేకాలు చేశారు. గ్రామస్తులు అమ్మవారికి కొత్త దుస్తులు, వివిధ సుగంధ పుష్పాలతో అలంకరించి మంగళవాయిద్యాల నడుమ గ్రామాల్లో ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామస్తులు వివిధ సుగంధ పుష్పాలు తీసుకొచ్చి అలంకరించి ఊంజల్ సేవలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



అమ్మవారికి ఊంజల్ సేవ, మొక్కుతున్న భక్తులు

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు

పంటల సాగులో విత్తనశుద్ధి కీలకం. తగిన జాగ్రత్తలతో విత్తనశుద్ధి చేసి, చీడపీడలు, తెగుళ్లను నివారించగలిగితే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ దిశగా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పించడానికి అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఇందుకు పుత్తూరు వ్యవసాయ డివిజన్ పరిధిలోని పుత్తూరు, వడమాలపేట, రామచంద్రాపురం, నారాయణవనం మండలాల్లో పొలంబడి కార్యక్రమాలు త్వరలో ప్రారంభం కానున్నాయి.

- చీడపీడలు, తెగుళ్ల నివారణ సాధ్యం
- తక్కువ ఖర్చుతో పంటకు రక్షణ



వేరుశనగ విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

పుత్తూరు: పుత్తూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 5 వేల హెక్టార్లలో వరి, వేరుశనగ, చెరకు, సజ్జ వంటి పంటలు సాగవుతున్నాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై అందజేస్తోంది. విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్స్ ద్వారా పొలంబడి కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలను అందిస్తోంది. దీంతో రైతులు పంటల సాగుకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా వేరుశనగ సాగుకు ముందు రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్నారు. విత్తనశుద్ధి చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు తెలియజేస్తున్నారు.

వేరుశనగ విత్తనశుద్ధి ఇలా..

- ఒక కేజీ వేరుశనగ విత్తనానికి 3 గ్రాముల బావిస్టన్ లేక ఎం.45 లేదా సాఫ్‌పొడి కలిపి విత్తనశుద్ధి చేయాలి. ఫలితంగా మొలకలు బాగా పెరిగి తెగుళ్లు రాకుండా నివారించబడతాయి.
- విత్తనశుద్ధి వ్యవసాయ అధికారుల సూచనల మేరకు తగిన మోతాదులో మాత్రమే చేపట్టాలి. మోతాదు మించితే విత్తనం మొలకెత్తక నాశనం అవుతుంది.
- విత్తన సాగు తర్వాత 25 నుంచి 35 రోజుల లోపు ఆకుపచ్చ తెగులు సోకకుండా కాంటఫ్ మందును స్ప్రే చేయాలి.
- 90 రోజుల తర్వాత బావిస్టన్‌ను స్ప్రే చేస్తే ఆకు బలంగా దృఢంగా ఏర్పడి మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది.
- విత్తనశుద్ధి చేసేటప్పుడు రైతులు ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజ్‌లు విధిగా వినియోగించాలి.

విత్తనశుద్ధి విధిగా చేయండి



పుత్తూరు వ్యవసాయ డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి, అధిక దిగుబడులు సాధించండి. పంట సాగుకు ముందు విత్తన శుద్ధి ఎంతో ఉపయోగకరం. ఏ పంటకైనా మోతాదుకు మించి ఎరువులు, మందులు వాడకూడదు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలి. అధికారులు సాగులో ఇచ్చే సలహాలు, సూచనలు పొందండి. విత్తనశుద్ధి విధిగా చేయండి. తద్వారా అధిక దిగుబడులు పొందండి.

– ఆర్.రమేష్‌రాజు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్, పుత్తూరు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

కార్వేటినగరం: మండల పరిధిలోని ఆర్కేవీబీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 25 సంవత్సరాల క్రితం 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులు సతీష్‌బాబు, షఫీ, పాఠశాల హెచ్‌ఎం అరుణను శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. 25 సంవత్సరాల అనంతరం విద్యనభ్యసించిన పాఠశాల ఆవరణలో కుటుంబసభ్యులతో పాటు కలుసుకోవడం వారి ఆనందానికి అవధులు లేకుండాపోయింది. అప్పటిలో వారు చేసిన చిలిపి చేష్టలు, ఉపాధ్యాయులు కొట్టిన దెబ్బలు, తరగతి గదిలో తోటి విద్యార్థులతో కలసి చేసిన అల్లర్లను గుర్తు చేసుకుని పాఠశాల ఆవరణలో చెట్టాపట్టాలు వేసుకుని కలయ దిరుగుతూ వారి కుటుంబసభ్యులను స్నేహితులకు పరిచయం చేసుకున్నారు. కుశలప్రశ్నలతో, ఆటపాటలతో ఆనందంగా గడిపారు. నిర్వాహకులు చలపతిరావు, పుణ్యకోటి, దినకర్, గంగాధర్, విజయ్, యుగంధర్, జయప్రకాష్, శేఖర్, కోమల, మోహనాంబ, ఉష, చంద్ర, సుజాత పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



నాట్య ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న కళాకారులు

చంద్రగిరి(తిరుచానూరు): వేసవి సెలవుల నేపథ్యంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తిరుపతికి చెందిన పలు నాట్యసంస్థల ఆధ్వర్యంలో నాట్య గురువు సుజేందర్ బాబు నేతృత్వంలో భరత నాట్యం, కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. ఇందులో భాగంగా అన్నమయ్య కీర్తనలు, త్యాగరాజు కీర్తనలు, ఆంధ్ర జానపద నృత్యాలు, తరంగం కూచిపూడి అంశం, కృష్ణ నృత్యం తెలంగాణ వంటి పాటలకు కళాకారులు తిరుపతికి చెందిన భవ్యశ్రీ బృందం, బెంగళూరుకు చెందిన దివ్యపాలక్ష బృందం, శృతి శంకర్ బృందం, హైదరాబాద్‌కు చెందిన నటరాజ నాట్యాలయం కూచిపూడి, బ్లూమింగ్ డేల్ నాట్యాలయం ఆధ్వర్యంలో భరతనాట్యం, తిరుపతి లలితాంబిక నృత్యాలయం ఆధ్వర్యంలో భరతనాట్యం, నాట్యరవళి డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో భరతనాట్యం, నటరాజ నృత్యాలయం ఆధ్వర్యంలో భరత నాట్యం, తీక్షణ భరతనాట్యం, హైదరాబాద్‌కు చెందిన సువర్ణ బృందం భరత నాట్యం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ముక్కంటి సేవలో చిత్తూరు కలెక్టర్



ఆలయ ధ్వజస్తంభం వద్ద చిత్తూరు కలెక్టర్ షణ్మోహన్


శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుని ఆదివారం చిత్తూరు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొల్లాపురమ్మ తిరునాళ్ల

నింద్ర: మండల కేంద్రమైన నింద్రలో కొల్లాపురమ్మ అమ్మవారి తిరునాళ్ల ఘనంగా జరిగింది. ఆదివారం ఉదయం అమ్మవారికి అంబలి పోశారు. సాయంత్రం అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి గెరిగెను గ్రామంలో ఊరేగించి, అమ్మవారి ఆలయానికి చేర్చారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకపూలతో అలంకరించి గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు తదితరులు పాల్గొన్నారు.



చారిత్రక చిహ్నం.. పాండురాజుల పార








కొండరాళ్ల మధ్య నిర్మితమై ఉన్న రాతిగూళ్లు

- కొండపై అబ్బుర పరిచే రాతిగూళ్లు
- చరిత్రకు ఆనవాళ్లుగా నిలుస్తున్న పారకొండ
- గతంలో ఇక్కడ షూటింగ్ జరుపుకున్న పలు చిత్రాలు


నగరి : మున్సిపల్ పరిధిలోని తిరుపతి జాతీయ రహదారి పక్కనే ఉన్న పాండురాజపురం గ్రామాన్ని ఆనుకుని పాండురాజులపార అనే కొండ ఉంది. ఈ కొండపై పురాణకాలంలో పాండవుల సంచరించారని అందుకే ఈ కొండకు పాండురాజుల పార అనే పేరు వచ్చిందని చారిత్రక ప్రసిద్ధి. వనవాస సమయంలో పాండవులు కొంతకాలం ఈ కొండపై నివాసం ఏర్పరచుకున్నట్లు ప్రతీతి. భూమట్టానికి 300 అడుగుల ఎత్తులో ఉన్న ఈ కొండపై ఉన్న ఆనవాళ్లను పాండవులు సంచరించినందుకు గుర్తులు అంటారు. ఈ కొండపై పాండవులు నివశించడానికి కొండరాళ్ల మధ్య నిర్మించుకున్న రాతిగూళ్లు, పడుకోవడానికి కొండపై ఏర్పాటుచేసుకున్న పడకల చిహ్నాలు, భీముడు వాల్చిన పెద్దబండ, బండరాళ్ల మధ్య దారి, కొండగుహలు, ద్రౌపది స్నానమాడినట్లు చెప్పబడే చిన్న నీటి గుంట ఇలా ఎన్నో వింతలు ఉన్నాయి.

దొంగలకు నిలయంగా.. !

ఈ రాతిగూళ్లు కాలక్రమేణా దోపిడీ దొంగలకు నివాసంగా మారాయని, వారు పలు ప్రాంతాల్లో దోపిడీ చేసుకుని వచ్చి ఈ కొండపై గూళ్లలో నివశించేవారని చారిత్రక కథనాలు ఉన్నాయి. కొండపై వింతలు చూడడానికి సమీప గ్రామ ప్రజలు తరచూ ఇక్కడకు వెళ్తుంటారు. ఎన్టీఆర్ నటించిన సతీ అనసూయ సినిమా, నాగార్జున నటించిన జానకిరాముడు, తమిళ నటుడు సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన రాజాదిరాజ, ప్రభు నటించిన పాసకిళిగల్, అర్జున్ నటించిన కౌబాయ్ నెంబర్1 చిత్రాలను ఈ కొండపై చిత్రీకరించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించే కొండచుట్టు ఉత్సవాల సమయంలో మున్సిపల్ పరిధిలోని సత్రవాడ, ఏకాంబరకుప్పం, చింతలపట్టెడ, కేవీపీఆర్ పేట, కొత్తపేటకు చెందిన పలువురు ఇక్కడకు విచ్చేసి పొంగళ్లు పెట్టి వనభోజనాలు చేస్తారు. మిగిలిన సమయాల్లో ఆకతాయిలు మాత్రమే ఆ కొండపైకి వెళ్లి ఇష్టారాజ్యంగా వ్యవరిస్తుంటారు. కొండపైకి వెళ్లాలంటే కొండరాళ్లపై ఎక్కుతూ వెళ్లాల్సిందే. దారి సక్రమంగా లేకపోవడంతో పలువురు వింతలను చూడలేకపోతున్నారు. ఇప్పటికే పాండవులు పాచికలాడినందుకు గుర్తుగా ఉన్న బండ కొండపై నుంచి కిందకు దొర్లి శిథిలమైంది.



భీముడు వాల్చినట్లు చెప్పే బండరాయి



రాతి ద్వారం

‘హే సిరి అలా వెళ్లకే’ షూటింగ్ ప్రారంభం

తిరుపతి(అలిపిరి): షీలోక్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై షీలా లోకనాథన్ నిర్మిస్తున్న ×హే సిరి అలా వెళ్లకే× వెబ్ సిరీస్ చిత్రం ఆదివారం మానస సరోవర్ హోటల్ వద్ద ప్రారంభమైంది. రచయిత భరత్, దర్శకులు క్రిస్టోఫర్ మాట్లాడుతూ ఇది ఒక ప్రేమ కథా చిత్రమన్నారు. విభిన్నమైన కథాంశంతో సాగుతోందన్నారు. ఇందులో హాస్యం, భావోద్వేగాలతో కూడిన సన్నివేశాలు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతాయని తెలిపారు. ఇందులో హీరోగా సాయి, హీరోయిన్‌గా షీలా లోకనాథన్, ఇతర ముఖ్యపాత్రలో మోనికా రాజ్, కామెడీశాస్త్రి, వినుకొండ రవి, సుభాష్ చంద్రబోస్, గుర్రప్ప నాయుడు, భరణి కుమార్, బేబీ అభిజ్ఞ, శోధన నటిస్తున్నారు. రచన భరత్, జీ9 ఫిలిం ఫ్యాక్టరీ చిత్ర నిర్మాణ సంస్థ సహాయ సహకారాలతో ఈ సినిమా 32 రోజుల్లో తిరుపతి పరిసర ప్రాంతాల్లో జరుగుతుందని దర్శకులు, ఎడిటర్ క్రిస్టోఫర్ తెలిపారు.



చిత్రం చిత్రీకరణలో పాల్గొన్న యూనిట్

అప్రమత్తతే శ్రీరామరక్ష

- వంట గ్యాస్ సిలిండర్‌కు కాలపరిమితి
- గడువు దాటితే ముప్పు తప్పదు
- గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అధికారులు



అగ్నిప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ /బంగారుపాళెం : గ్యాస్ సిలిండర్‌తో వంట చేసుకోవడం ఎంత సులభమైన పద్ధతో, సరైన జాగ్రత్తలు పాటించకపోతే అంతే ప్రమాదం ఉంటుంది. సిలిండర్‌కు కాలపరిమితి ఉంటుందని చాలా మందికి తెలియదు. ఈ విషయాన్ని తెలుసుకుని గమనిస్తూ ఉండాలని నిపుణులు చెబుతున్నారు. గడువు తేదీ ముగిసిన సిలిండర్‌ను వినియోగిస్తే గ్యాస్ లీకయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. వంట గ్యాస్ కంపెనీలు సరఫరా చేసే ప్రతి సిలిండర్‌పై గడువు తేదీ కోడ్ విధానంలో ఉంటుంది. గడువు తేదీని ప్రతి సిలిండర్ పై ఖచ్చితంగా మెటల్ ప్లేట్‌పై ముద్రిస్తారు. సిలిండర్‌ను మార్చుతున్నప్పుడల్లా ఆ గడువు తేదీని చూసుకుని అప్రమత్తంగా వినియోగించాల్సి ఉంటుంది.

గుర్తించడం ఇలా..

ఉదాహరణకు సిలిండర్ మెటల్ ప్లేట్ పై ఏ–24, బీ–24 అని ఉంటే... ఆ సిలిండర్ 2024 మార్చికి గడువు ముగిసిపోతుందని అర్థం. 24 అంటె 2024 సంవత్సరానికి, ఆంగ్ల అక్షరం త్రైమాసికానికి సూచిక. ఏ అక్షరం జనవరి నుంచి మార్చి వరకు, బీ అక్షరం ఏప్రిల్ నుంచి జూన్ వరకు, సీ అక్షరం జూలై నుంచి సెప్టెంబర్ వరకు, డీ అక్షరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగుస్తుందని గుర్తించాల్సి ఉంటుంది.

ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోవద్దు

సిలిండర్ ఇంటి వద్దకు వచ్చిన వెంటనే మెటల్ ప్లేట్ పై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీని. గడువు తేదీ నెల వ్యవధిలో ముగుస్తున్నట్లు సిలిండర్‌పై ఉంటే ఆ సిలిండర్‌ను తీసుకోకూడదు. ఎందుకంటే చిన్న కుటుంబాల వారికి నెల రోజులకు పైగా గ్యాస్ వస్తుంది. ఆ సిలిండర్ స్థానంలో వేరే సిలిండర్ అడిగి తీసుకునే హక్కు వినియోగదారుడికి ఉంటుంది.

పదేళ్ల గడువు

సిలిండర్ తయారైనప్పటి నుంచి పదేళ్ల వరకు గడువు ఉంటుంది. సిలిండర్‌ను ప్రత్యేక మైన ఉక్కుతో సిలిండర్ లోపల సురక్షితమైన కోటింగ్‌తో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ప్రమాణాల మేరకు తయారు చేస్తారు. బీఐఎస్ అనుమతులు తీసుకున్న తరువాతే సిలిండర్ మార్కెట్‌లోకి వస్తుంది.

ప్రజల్లో చైతన్యం

గృహాల్లో అగ్ని ప్రమాదాలు, గ్యాస్ లీకేజీ ప్రమాదాలు సంభవించినప్పుడు నష్ట నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై అధికారులు ప్రతి సంవత్సరం అవగాహన కల్పిస్తుంటారు. ఈ మేరకు విద్యాసంస్థలు, కాలనీల్లో మాక్ డ్రిల్ నిర్వహిస్తుంటారు. గ్యాస్ సిలిండర్లను ఇతర ప్రాంతాలకు తీసుకెళుతున్నప్పుడు గ్యాస్ లీకేజీ కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరిస్తారు. గ్యాస్ లీకేజీ అయి ప్రమాదం సంభవిస్తే విపత్తు తీవ్రత తగ్గించేందుకు ఎలా వ్యవహరించాలో సూచనలు చేస్తారు. ప్రమాదం ఎదురైనప్పుడు వేగంగా ప్రతిస్పందించడంతోపాటు చురుకైన ఆలోచనతో తీవ్రతను నియంత్రించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేస్తారు. అనంతరం ఫైర్ సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించి ప్రమాదం జరిగినప్పుడు ప్రతిస్పందించాల్సిన తీరుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డిప్యూటీ రీజనల్ హెడ్ సందీప్ మిస్త్రి, ఆపరేషన్స్ మేనేజర్ డి.శ్రీను, సేఫ్టీ ఆఫీసర్ శబరి బాబు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుడి హక్కులు

- గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు కొన్ని హక్కులు ఉన్నాయి.
- గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారుడు మృతి చెందితే వారి కుటుంబ సభ్యుల పేరిట ఆ కనెక్షన్ మార్పు చేసుకోవచ్చు.
- కొత్త కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే నిబంధనల మేరకు ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే అదే రోజు కనెక్షన్ పొందవచ్చు.
- కొత్త కనెక్షన్ తీసుకునే సమయంలో తమ వద్దనే స్టవ్ కొనుగోలు చేయాలని డీలర్లు కోరవచ్చు. అయితే డీలర్ల వద్దనే స్టవ్ కొనుగోలు చేయాలన్న నిబంధన ఏమీ లేదు.
- గ్యాస్ ఏజెన్సీ నుంచి 5 కిలోమీటర్ల పరిధిలోని వినియోగదారులకు సిలిండర్ ఉచితంగా డోర్ డెలివరీ చేయాలి.



సిలిండర్ పై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీ

జయశంకర్‌కు అరుదైన గౌరవం

తిరుపతి సిటీ : ఎస్వీయూ భౌతికశాస్త్ర విభాగం విశ్రాంత ప్రొఫెసర్ సీకే జయశంకర్‌కు అరుదైన గౌరవం లభించింది. థాయిలాండ్ ఫిజిక్స్ అసోసియేషన్ ఆయనకు జీవితకాలపు సభ్యత్వం కల్పించింది. దీంతో ఆయన ఈ ఘనత సాధించిన మొట్టమొదటి భారతదేశపు భౌతిక శాస్త్రవేత్తగా చరిత్ర సృష్టించారు. థాయిలాండ్ వేదికగా ఈనెల 5వ తేదీ నుంచి 7వరకు జరిగిన సియా ఫిజిక్స్ కాంగ్రెస్–2024 కార్యక్రమంలో ఆయన పాల్గొని అధ్యక్షత వహించి కీలక ఉపన్యాసం చేశారు. కార్యక్రమం ముగింపు రోజున ఆయనకు ఫిజిక్స్ అసోసియేషన్ చెందిన కింగ్‌మోంగ్‌కుట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ విసను పెచరసా, నఖోన్ ఫాతోమ్ రాజాభట్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ జక్రాపాంగ్ కైనోఖావో జీవితకాల సభ్యత్వాన్ని ఆయనకు అందజేశారు. ఈ ఘనత సాధించిన ఆయనకు ఎస్వీయూ వీసీ, బోధన, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.



జీవితకాల సభ్యత్వం అందజేసిన థాయిలాండ్ ఫిజిక్స్ అసోసియేషన్ సభ్యులతో విశ్రాంత ప్రొఫెసర్ సీకే జయశంకర్